# తొందరపడి ఒక కోయిల

## 22 ఆగస్టు 1989

అమ్మ రోజూ పోస్ట్‌మాన్‌ని అడుగుతోంది మా లెటర్స్ వున్నాయా అని. కాని 'జగిత్యాల' నించి రిప్లయ్ రాదని నాకు, నాన్నకు మాత్రమే తెలుసు. వాళ్ళ మాటల్ని బట్టి నాకంటె, నేను తెచ్చే కట్నమ్మీదే ఆసక్తి ఉన్నట్టు తెలుస్తోంది. ఎందుకో నాన్నను చూసినప్పుడల్లా నాకు ఏడ్పువస్తుంది.

## 3 సెప్టెంబర్, బుధవారం

మళ్ళీ ఈరోజు ఎవరో వస్తున్నారట. అలాగే కూచోవటం. వాళ్లు టిఫిన్‌లు మెక్కుతూ చూపుల్తో తనని తినెయ్యటం....తక్కువ కట్నమిస్తామనే నాన్న అశక్తతని ఆసరా చేసుకొని జారుకోవటం ఇది ఎనిమిదో సంబంధం....అమ్మ లక్షలసార్లు దేవుళ్ళకు మొక్కుకుంటుంది.

భగవంతుడా....ఆడపిల్లగా ఎందుకు పుట్టించావ్?

## 18 సెప్టెంబర్, శనివారం

వాళ్ళనించి వచ్చిన ఉత్తరాన్ని పోస్టుమాన్ తెచ్చిచ్చాడు. కట్నం తక్కువైనా లాంఛనాలు ఎక్కువడిగారు? ఎంతంటే....మేం ఇచ్చుకోలేనంత! అమ్మ వంటింట్లో చాలాసేపు ఏడ్చింది. నాన్న పడక్కుర్చీలో శూన్యంలోకి చూస్తూ కూచున్నారు. ఆయన కళ్ళల్లో అంతులేని ఆవేదన....

బజారుకు వెళితే వెకిలిగా నవ్వే వెధవలు....ఆడపిల్ల ముందు కూచునేసరికి అరలక్షపైన 'అ(గ్రాస్' పలికించుకోవటానికి సిగ్గు శరమూ వుండట్లేదూ....

ఈ వరకట్న వ్యవస్థ ఒక్కసారిగా తిరిగి కన్యాశుల్కంగా మారితే ఈ వెధవలకి తెలిసేది మా వేదనెంతో....

## 19 అక్టోబర్, గురువారం

నా వయసు ఈ రోజుకి ఇరవై అయిదో సంవత్సరంలోకి అడుగు పెట్టింది. ఎందుకో? అమ్మ ఈరోజు మరీ కృంగిపోయినట్టు కన్పిస్తోంది. నా అందం పెరిగితేనేం? ఆస్తి పెరగటం లేదు. సుబ్బరామయ్యగారు మరేదో సంబంధం గురించి చెపుతుంటె నాన్నలో నిర్లిప్తత.

ఈనాటి యువతరమ్మీద నాన్నకు నమ్మకం పోయింది. ఉపాధ్యాయుడుగా రిటైరైనరోజున ఎన్నో ప్రగల్భాలు పలికిన విద్యార్థుల్లో ఒక్కడూ అల్లుడి అర్హతను పొందడానికి రావటం లేదు. కారణం మా ఆర్థిక లోటు....

నాకు పెళ్ళిమీద ఆశలన్నీ అడుగంటి....పెళ్ళిచూపుల పేర వచ్చిన మగపురుగును ఇక తలెత్తి చూడదల్చుకోలేదు.

## 15 నవంబర్, శనివారం

అమ్మతో మొదటిసారి తగువుపడ్డాను....

ఎవడో వస్తాడట. మళ్ళీ కూచోవాలట. వస్తున్న ప్రతివాడ్ని వచ్చి పోయేంతవరకూ మొగుడుగానే వూహించుకోవటం ఈ వయసులో ఎంత దుర్లభం.

నాన్న అప్పుచేసి స్వీట్లు తెచ్చాడు. మనసంతా అన్యమనస్కంగా వుంది. ఎందుకో నాన్నను చూస్తుంటె కళ్ళనీళ్ళు తిరిగాయి. ఆయన ఎదపై బడి బావురుమని ఏడ్చాను. వేదన కరిగి కన్నీళ్ళలా మారి ఉబికి వస్తుంటె...తనివి తీరా ఏడ్చే అదృష్టం కూడా లేదేమో....'వాళ్ళొస్తున్నారు' అని చెప్పివెళ్ళారెవరో...

బలవంతంగా దుఃఖాన్ని, కన్నీళ్ళను ఆపుకున్నాను. అమ్మ హడావుడి పడుతోంది.

నన్ను వాడిముందు కూచోబెట్టారు. ఒక్కడే వచ్చాడు.

ఇంతకు ముందు వచ్చిన వాళ్ళంతా రెండుగంటలు వుండిపోతే... వీడు రెండు రోజులు వుండిపోయాడు. వాడికి ఏలోటూ రాకుండా మర్యాదలు చేసారు.

వీళ్ల ఆశలన్నీ వాడి మీదే.

## 2 డిసెంబర్, సోమవారం

వాడినించి ఏ సమాధానం రాకపోగా ఒక దారుణమైన విషయం బయటపడింది.

వాడేదో ఉద్యోగ ప్రయత్నంలో ఈ వూరొచ్చి వూర్లో చుట్టాలెవరూ లేకపోగా పెళ్ళిచూపుల ప్లానుతో రెండురోజులు మాయింట్లో వుండి పనిచేసుకొని పోయాడని...

వాడికిప్పుడు ఉద్యోగమొచ్చి...లక్షరూపాయల సంబంధమేదో ఇదే వూర్లో ఖాయమైందని...

దొంగ లంజాకొడుకులు...

నాన్న నోటినించి మొదటిసారి బూతులు వెలువడ్డాయి. నేను మాత్రం కుళ్ళి కుళ్ళి ఏడ్చాను. అమ్మ ఓదారుస్తుంటె నా దుఃఖం రెట్టింపయింది.

నన్ను ఓదారుస్తూనే అమ్మ బాగా ఏడ్చింది.

## 11 జనవరి 1990 సోమవారం

వరంగల్ నించి అక్కయ్య వచ్చింది. గంపెడు పిల్లల్ని వెంటేసుకొని...వస్తూ వస్తూ తమకు ఇస్తామన్న కలర్ టీవీ ఇస్తేనే వెళ్తానంది. అమ్మ అక్కయ్య పెద్దగా అరుచుకున్నారు.

తనకేమంత కట్నమిచ్చారని అక్క వాదిస్తోంది?

నా కెందుకో ఇంట్లో వుండాలన్పించలేదు. సిన్మాకెళ్లాను.

ఒక్కొక్కడి చూపులు....శరీరమ్మీద గొంగళి పురుగులు పాకినట్లయింది...వెన్నెలని ఖైమా చేసి పంచినట్లు నవ్వటం చేతకాని వెధ

వలు....వాళ్ళ జీవితంలో ఆడపిల్ల కనురెప్పల చప్పుళ్ళకి అర్థం చెప్ప గలరా?

## 28 మార్చి, బుధవారం

ప్రక్కింట్లో రాత్రి పెడబొబ్బలు...బాంబు ప్రేలినంత శబ్దం. అంతా ఉలిక్కిపడి లేచేసరికి సుజాత గ్యాస్‌స్టవ్ ప్రేలి చచ్చిపోయిందన్నారు. కాని సుజాత చాలా తెలివైందని నాకు తెలుసు.

మాన్‌ఫాక్చరింగ్ డిఫెక్టేంకాదు...ఖచ్చితంగా టార్చరింగ్ ఎఫెక్టే. ఇరవై అయిదు వేల వరకూ పోలీసులకు పంచి పెద్ద మనిషనిపించు కున్నాడు. ఇంకా డెబ్బయ్ అయిదు వేలు లాభం...

లక్ష రూపాయల్తో మరో సంబంధం ఖాయం కానుందట. ఎందుకో మొదటిసారి భయమేసింది మగాడంటేనే...మరో సంబంధం నాకు రానుందని తెల్సి నిలువెల్లా వణికిపోయాను.

'హిస్టీరియా'కు లోనవుతానా అనే భయంకూడా వేసేది. గుండెను నిబ్బరపరచుకోవడానికి పుస్తకాలు చదివేదాన్ని.

## 30 ఏప్రిల్, మంగళవారం

'పోస్ట్' అన్న కేకవిని ఆశ్చర్యపోయాను. ఎక్కడ్నించీ వచ్చే సమయం కాదు. కవర్ అందుకుంటుంటె పోస్టుమాన్ కళ్లతో నవ్వాడు. ఎందుకో....నా కోసం అంతటి ఆత్మీయంగా నవ్వేవారున్నారన్న భావన హాయిగా తోచింది.

నా పేరు మీదే అది రావటంతో విస్మయంగా మంచంమీద పడు కొని కవర్ విప్పాను. "మీ ఆందోళనా, ఆవేదనా నేనర్థం చేసుకోగలను. నన్నర్థం చేసుకునే ఆత్మస్థైర్యం మీకుంటె నాతో కల్సి ఏడడుగులు నడి పించుకునే గుండెధైర్యం నాకుంది.

మీ అభిప్రాయం తెలుపండి—పోస్టుమాన్".

కొన్ని గంటల వరకూ నాకేం అర్థంకాలేదు, ఆ తర్వాత గాల్లో

తేలిపోయాను. సీతాకోక చిలుకలా సింగారించుకొని రోజంతా నవ్వుతూనే వున్నాను.

అయినా ఎక్కడో అవ్యక్తమైన బాధ...ఏమిటది ???

## 2 జూన్, శుక్రవారం

అతడు ఉత్తరాలు అందించి వెళ్తున్నాడు. భావుకత నిండిన అక్షరాలు. మొదటిసారి మగవాడ్ని నమ్మాను. అమ్మకు చెబితే అభ్యంతరం తెలిపింది. నా నిర్ణయంకూడా ధృఢపడింది. నాన్న మౌనంగా వుండిపోయాడు.

గుండెల్లో సుడిగుండాలు తిరుగుతూ మళ్ళీ ఈ రోజు నరకయాతన అనుభవించాను.

## 14 జూలై, సోమవారం

ఈరోజు అతడితో వెళ్ళిపోతున్నాను. వెళ్ళిపోతున్నాను అనే కంటె వీళ్ల భాషలో లేచిపోతున్నానంటె సరిపోతుందేమో?

కట్నాలు, కానుకలు ఏమీలేకుండా...అమ్మానాన్నల గుండెల కుంపటి చల్లార్చి పోతున్నాను. సాంప్రదాయం పేర ఆ కుంపట్లో కాళ్ళు పెట్టి గుండెమంటల్ని రెట్టింపు చేసుకుంటె తప్పు నాదికాదు.

పెళ్ళి చూపుల తతంగంలో నేనెంతటి మానసిక క్షోభననుభవించానో నాకు మాత్రమే తెల్సు.

లేచిపోవటం కంటె చచ్చిపోవటం నయమనుకుంటె....జీవితాన్ని మీరెంత అర్ధం చేసుకున్నారో నాకు తెల్సు. వేదమంత్రాల మధ్య అరుంధతీ నక్షత్రం చూసే అదృష్టం నాకు లేదు.

మీ భాషలో కట్నమిచ్చి చావటం కన్నా...కట్నం లేక చావటంలో లాభముంది. అతడు నన్ను ప్రేమగా చూసుకుంటాడనే నమ్మకం కలిగాకే వెళ్తున్నాను.

నన్ను ఏవగించుకోకండి....గుడ్ బై....

సిగ్గుతో చచ్చిపోవాలనుకున్న ఆ తల్లి దండ్రులు...ఆమె డైరీలు చదివి నిర్ణయాన్ని మార్చుకున్నారు.

★